# గుట్టలో నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

- ముస్తాబైన వ్రత మండపం
- వైభవంగా నిత్యోత్సవాలు


ముస్తాబైన సత్యనారాయణ వ్రత మండపం

యాదగిరిగుట్ట, నవంబర్ 13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో కార్తీక మాసానికి అధికారులు ముస్తాబు చేశారు. సత్యనారాయణ వ్రత మండపం, దీపారాధనకు ఆలయాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధానాలయ మాఢవీధుల్లో ఈశాన్య ప్రాంతం, శివాలయం మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్‌లోని క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, కొండ కింద నూతన సత్యనారాయణ వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి చెంత, పాతగుట్ట ఆలయం వద్ద దీపారాధనకు స్థానాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు దీపారాధన నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ అన్నవరంగా పేరుపొందిన యాదగిరిగుట్ట క్షేత్రంలో కార్తీక మాసంలో అత్యధిక వ్రతాలు జరుగుతాయని అందుకు అనుగుణంగా సకల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు కొండకింద నూతన ఘాట్ రోడ్డు పక్కన గల నూతన వ్రత మండపంలో కార్తీక మాసాంతం 6 బ్యాచ్‌లను నిర్వహిస్తామన్నారు. కార్తీక శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 27న 8 బ్యాచ్‌ల్లో వ్రతాలు నిర్వహించనున్నారు. రూ.800 రుసుముతో వ్రతానికి కావాల్సిన సామాగ్రి ఆలయ అధికారులే సమకూర్చనున్నారు. అందుకు అనుగుణంగా వ్రత మండపాన్ని అధికారులు సిద్ధం చేశారు. పాతగుట్ట ఆలయంలో 5 బ్యాచ్‌లుగా వ్రతాలను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ అధికారులు కోరారు. లక్ష్మీ నారసింహుల నిత్య తిరు కల్యాణోత్సవం సోమవారం ఘనంగా జరిపించారు. మొదటగా సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరు కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వయంభువుడిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. సోమవారం కావడంతో పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వరాలయంలో లింగేశ్వర కుటుంబంతో పాటు ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన స్ఫటిక లింగేశ్వరుడికి ప్రభాతవేళ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సుమారు గంటన్నర పాటు జరిపారు. దీపావళి సందర్భంగా ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు హారతినిచ్చారు. ప్రధానాలయంలో ధన లక్ష్మి పూజ నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల అష్టోత్తర శతఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. అన్ని విభాగాలను కలుపుకొని సోమవారం స్వామివారి ఖజానాకు ఆదాయం రూ.33,68,134 సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.


దీపావళి సందర్భంగా ధనలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనర్సింహాచార్యులు


మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ముదిరాజ్ కుటుంబాలు

## జగదీశ్‌రెడ్డికి జైకొడుతున్న పేటవాసులు

- ఒక్కొక్కటిగా అన్ని సంఘాల మద్దతు
- 150ముదిరాజ్ కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరిక
- మద్దతు ప్రకటించిన మార్వాడీ కుటుంబాలు

సూర్యాపేట టౌన్, నవంబర్ 13 : ఎన్నికలు సమీపిస్తున్న వేళ సూర్యాపేటలో రోజురోజుకూ గులాబీ జోష్ మరింత పెరుగుతున్నది. పదేండ్లుగా కోట్లాది రూపాయలతో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డికే అన్ని సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు పలుకుతున్నాయి. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రజలంతా ముక్తకంఠంతో ఏకమవుతున్నారు. ప్రశాంత పాలనకే పట్టం కడుతామంటున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన 150 ముదిరాజ్ కుటుంబాల వారు మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. పెన్‌పహాడ్ ఎంపీపీ నెమ్మాది భిక్షం ఆధ్వర్యంలో చీదెళ్ల గ్రామానికి చెందిన 45మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

సూర్యాపేటలో వివిధ వ్యాపారాల్లో కొనసాగుతున్న సుమారు 70 మార్వాడీ కుటుంబాలు ఏకమై స్వచ్ఛందంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని మంత్రి జగదీశ్‌రెడ్డికి తమ మద్దతు ప్రకటించాయి. మంత్రి జగదీశ్‌రెడ్డి వచ్చినప్పటి నుంచే ప్రశాంతత పెరగడంతో క్రమంగా వ్యాపారాలు వృద్ధి చెందాయని అందువల్లే తమకు ఉపాధి పెరిగిందని ముఠా కూలీలు, హమాలీలంతా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకుని మంత్రి జగదీశ్‌రెడ్డికే తమ మద్దతు ప్రకటించారు. వీటితో పాటు అన్ని సంఘాలు, మహిళలు, యువత ఆత్మీయ సమ్మేళనాలతో భారీగా చేరికలతో గులాబీ జెండాకు మరింత ఆదరణ పెరిగింది. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఆయా సంఘాల పెద్దలు, నాయకులు, వ్యాపారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే దళిత జాతి అభ్యున్నతి

- బీఆర్‌ఎస్‌కు టీఎమ్మార్పీఎస్ మద్దతు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతను భారీ మెజారిటీతో గెలిపిస్తాం
- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్. పక్కన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

ఆలేరు, నవంబర్ 13 : అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ కార్యచరణ ఉన్నందున అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆలేరులో సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి అంబేద్కర్ తరువాత అంతగా ఆలోచించిన మేధావి సీఎం కేసీఆర్ అని కొనియాడారు. దళితుల పక్షపాతిగా సీఎం కేసీఆర్ చరిత్రలో నిలుస్తారన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి దళితులంతా పూర్తి మద్దతు అందించి వచ్చే ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ విజయానికి సహకరిస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ 100 రోజుల్లో అంటూ మోసం చేసిన బీజేపీ, వర్గీకరణ చేపట్టకుండా మాదిగ యువకుల ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్ పార్టీలకు మాదిగ, మాదిగ ఉపకులాలు ఒక్క ఓటు సైతం వేయవద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే వర్గీకరణ అంశం కనుమరుగు అవుతుందన్నారు. బీజేపీ వస్తే మాదిగలపై అత్యాచారాలు కొనసాగుతాయన్నారు. మనువాద పార్టీ బీజేపీని ఎప్పటికీ నమ్మవద్దని సూచించారు. బీజేపీ ప్రభుత్వం మాదిగలకు చేసిందేమీ లేదన్నారు. మాదిగల విశ్వరూప మహాసభలో ప్రధాని మోదీ రాజకీయ ప్రసంగం తప్ప, మాదిగ జాతికి ప్రయోజనం గురించి మాట్లాడలేదని, కమిటీల పేరుతో కాలయాపన ఎందుకు? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ వర్గీకరణ పై ఎందుకు స్పష్టమైన హామీ ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ వర్గీకరణ చేయకపోగా దేశంలో దళితులపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు ఉన్నందునే మాదిగల ఓటు బ్యాంకులా వాడుకోవడానికి మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చూస్తున్నాయన్నారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి ఢిల్లీకి ప్రతినిధుల బృందాన్ని పంపి మాదిగల అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. దళితులంతా ఐక్యంగా ఉద్యమించి కాంగ్రెస్, బీజేపీలకు రాబోయే ఎన్నికల్లో సరైన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు.

### వంగపల్లి మద్దతుతో మారనున్న సమీకరణాలు

బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్ రెడ్డికి టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మద్దతు ప్రకటనతో ఆలేరులో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. మరో మూడు నాలుగు రోజుల్లో మాదిగలతో భారీ సమావేశం ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్‌కే ఓట్లు పడేలా వంగపల్లి వ్యూహాలు పన్నుతున్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే

- మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమేనని, ఆలేరు ప్రాంతమంతా అంధకారంలోకి వెళ్తుందని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రేటెంతరెడ్డిగా మారాడని ఆరోపించారు. టికెట్లు అమ్ముకుని కోట్ల రూపాయలను సంపాదించే రేవంత్‌రెడ్డి రేపు రాష్ట్రాన్ని సైతం అమ్ముతాడని మండిపడ్డారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశ్, గంగుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యుడు చిలుకమారి గణేశ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేశ్, నాయకులు గ్యాదపాక మల్లేశ్, గంగాపురం రాములు, గొల్లూరి ప్రభాకర్, రాజాపేట, గుండాల, మోటకొండూర్ మండలాల అధ్యక్షులు నత్తి కిష్టయ్య, పి.పరుశరాములు, వంగపల్లి ఉప్పలయ్య, కొల్లూరు మొగులయ్య, మీసాల ఉప్పలయ్య, ఎర్ర విజయ్, సుధాకర్, కొల్లూరు హరిబాబు, బొట్ల జహంగీర్, రాజు, బీఆర్‌ఎస్ నాయకులు మొరిగాడి వెంకటేశ్, దాసి సంతోష్, ఆడెపు బాలస్వామి, పంతం కృష్ణ, జంపాల దశరథ, పత్తి వెంకటేశ్ పాల్గొన్నారు.


బుద్ధవనంలోని ఎంట్రెన్స్ ప్లాజా అశోక చక్రం నుంచి మహాస్తూపం వరకు దీపాలతో ర్యాలీ తీస్తున్న మాజీ ఎంపీ యశ్వంత్ అంబేద్కర్, బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, బౌద్ధ అభిమానులు

## జీవితాల్లో వెలుగు నింపడమే ధమ్మ దీపోత్సవం

- బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నందికొండ, నవంబర్ 13 : అసమానతలు అనే అంధకారం తొలగించడానికి ప్రజల జీవితాల్లో వెలుగు నింపడానికి నిదర్శనంగా ధమ్మ దీపోత్సవం జరుపుకొంటామని బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. నల్లగొండ జిల్లా నందికొండ పైలన్‌కాలనీలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు బుద్ధవనంలో ఆదివారం సాయంత్రం ధమ్మ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ, బీఆర్ అంబేద్కర్ మనుమడు, భారీపా బహుజన్ మహాసంఘ్ పార్టీ అధ్యక్షుడు ప్రకాశ్ యశ్వంత్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుద్ధవనం ఎంట్రెన్స్ ప్లాజాలోని అశోక చక్రం నుంచి మహాస్తూపంలోని ధ్యానమందిరం వరకు దీపాలతో ర్యాలీ నిర్వహించారు. మహాస్తూపంలోని బుద్ధుడి ధాతువులు, బుద్ధ విగ్రహాలు, ఆచార్య నాగార్జున విగ్రహం చుట్టూ దీపాలు పెట్టి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఇల్లు విడిచి వెళ్లిన సిద్ధార్థుడు గౌతమ బుద్ధుడిగా తొలిసారి కపిలవస్తు నగరానికి వచ్చినప్పుడు ప్రజలంతా ఆనందోత్సాహాలతో ప్రతి ఇంటినీ దీపాలతో అలంకరించి దీపోత్సవాన్ని నిర్వహించుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి బౌద్ధులు ధమ్మ దీపోత్సవాన్ని నిర్వహించే సంప్రదాయాన్ని నెలకొల్పారన్నారు. ధమ్మ దీపోత్సవం నేపథ్యాన్ని వివరించి క్రమం తప్పకుండా బుద్ధవనంలో ధమ్మ దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ప్రకాశ్ యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ సమాజంలోని ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపడానికి నిదర్శనంగా బౌద్ధులు ధమ్మ దీపోత్సవాన్ని జరుపుకొంటారన్నారు. మంచి, చెడులను విశ్లేషించి మంచిని మాత్రమే స్వీకరించే నైతికతను జీవన విధానంగా బోధించిన బుద్ధుడి మార్గం ఆచరణీయమని పేర్కొన్నారు. బుద్ధవనం రానున్న రోజుల్లో అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధమ్మ దీపోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం బుద్ధుడి పాదాల వద్ద పూజలు నిర్వహించి మహాస్తూపంపై నుంచి ఆకాశంలోకి దీపాలను వదిలారు. కార్యక్రమంలో బుద్ధవనం నిపుణులు ఈమని శివనాగిరెడ్డి, ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి, కేకే రాజా, కేవీఎన్ మూర్తి, సహాయక శిల్పి శ్యామ్ సుందర్, బౌద్ధ అభిమానులు పాల్గొన్నారు.